## క్లుప్తంగా

### వైద్యరంగంలో ఫార్మసిస్టులది కీలకపాత్ర



ర్యాలీ చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

విజయనగరం ఫోర్ట్: వైద్య రంగంలో ఫార్మాసిస్టులది కీలకపాత్ర అని సెయింట్ ఆన్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్ తెలిపారు. ప్రపంచ ఫార్మాసిస్టు దినోత్సవం సందర్భంగా కళాశాల నుంచి ఆర్అండ్‌బీ అతిథిగృహం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

### సకాలంలో ఆస్పత్రిలో చేర్చాలి..


సమావేశంలో మాట్లాడుతున్న నజీర్ హుస్సేన్

విజయనగరం ఫోర్ట్: రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చాలని 108 అరబిందో ఎమర్జెన్సీ సంస్థ మేనేజర్ నజీర్ హుస్సేన్ అన్నారు. సోమవారం స్థానిక సంస్థ కార్యాలయంలో ఈఎంటీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే చికిత్స అందించి ప్రాణపాయం నుంచి తప్పించాలన్నారు. ప్రమాదం జరిగిందని సమాచారం వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏజేటీ ఎ.శ్రీనివాసరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ రవి కుమార్, ఉపేంద్ర, సాయి షణ్ముఖ్, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ హరీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె. సతీష్, తదితరులు పాల్గొన్నారు.

### అలుగోలు విద్యార్థుల ప్రతిభ


రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలకు హాజరైన విద్యార్థులు

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ కాంపిటీషన్ పోటీలను ఎంఈఓ-2 ఈపు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ పోటీలకు తొమ్మిది పాఠశాలల నుంచి 27 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అలుగోలు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవడంతో ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని ఫోర్ట్‌సిటీ స్కూల్‌లో జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ ఆనందమూర్తి, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

### దీనదయాళ్ చిరస్మరణీయుడు


దీనదయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బవిరెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులలో ఒకరైన పండిత్ దీన దయాళ్ చిరస్మరణీయులని బీజేపీ సేవా పక్వాడ్ జిల్లా కన్వీనర్, జిల్లా మాజీ అధ్యక్షుడు బవిరెడ్డి శివ ప్రసాదరెడ్డి అన్నారు. దీనదయాళ్ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాణంగిపల్లి అశోక్, అల్లూరి రామకృష్ణరాజు, కుసుమంచి సుబ్బారావు, యువ మోర్చా నాయకులు పిల్లా నవీన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### వితరణ


బెంచీలతో కళాశాల సిబ్బంది

విజయనగరం అర్బన్: మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలకు విశాఖకు చెందిన హెచ్‌పీసీఎల్ సంస్థ రూ.10 లక్షల విలువ చేసే డ్యూయల్ డస్క్ బెంచ్‌లను వితరణగా సోమవారం అందజేసింది. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దననాయుడు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల
- పార్టీలో చేరిన పలువురి చేరిక


టీడీపీ నాయకుడు సూర్యనారాయణను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అంబళ్ల, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమంతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ విజయ ఢంకా మోగిస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు అన్నారు. మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కోరాడ సూర్యనారాయణతో పాటు పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరాయి. వీరందరికీ శ్రీరాములనాయుడు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నేడు జరుగుతున్నాయని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం జగనన్న శతశాతం అమలు చేశారని చెప్పారు. పార్టీలో చేరిన సూర్యనారాయణ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తోందని, అందుకే పార్టీలో చేరామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన

నెల్లిమర్ల: మొయిద జంక్షన్ సచివాలయం - 2 పరిధిలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వార్డు వలంటీర్లు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వేను పక్కాగా శతశాతం పూర్తి చేయాలని సూచించారు. అనంతరం 8వ వార్డు సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు తప్పనిసరిగా యూనిఫారం ధరించాలని సూచించారు. అనంతరం జరజాపుపేట - 2 సచివాలయ పరిధిలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్, అసిస్టెంట్ ఇంజినీర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్యసురక్ష సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

# ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి

వియనగరం: ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా నగరంలో పారిశుధ్యం మెరుగుకు మరింత కృషి చేయాలని సచివాలయ కార్యదర్శులు, మేస్త్రీలకు విజయనగరం కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి ఆదేశించారు. నగరంలోని 2, 3, 4, 5 సచివాలయాల పరిధిలో సోమవారం పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం చెత్తసేకరణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వీధులలో చెత్తాచెదారాలు పేరుకుపోకుండా, కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా, దోమల వృద్ధిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే చెత్త పన్ను వసూలు ముమ్మరం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పారిశుధ్య పనుల పర్యవేక్షకుడు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ధనుంజయరావు

- సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారి ధనుంజయరావు

విజయనగరం ఫోర్ట్: దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేదంతో నయం చేయవచ్చునని సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారి ధనుంజయరావు తెలిపారు. సోమవారం స్థానిక బాబామెట్టలోని వృద్ధాశ్రమంలో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయుర్వేదంలో పంచకర్మ చికిత్సకు మంచి స్పందన వస్తోందన్నారు. పక్షవాతం, మోకాళ్ల నొప్పులు, నడుంనొప్పి, తదితర సమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తోందని తెలిపారు. అనంతరం 83 మందికి పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, మహాలక్ష్మి, గౌతమి పాల్గొన్నారు.

# గ్రీన్ అంబాసిడర్ల సేవలు వెలకట్టలేనివి

- ఈఓపీఆర్‌డీ తిరుపతినాయుడు

విజయనగరం రూరల్: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో కీలకపాత్ర పోషించే గ్రీన్ అంబాసిడర్ల సేవలు వెలకట్టలేనివని విజయనగరం ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నారాయణపురం సచివాలయంలో సోమవారం గ్రీన్ అంబాసిడర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో గ్రీన్ అంబాసిడర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


గ్రీన్ అంబాసిడర్లను సత్కరిస్తున్న ఈఓపీఆర్డీ తిరుపతినాయుడు, పంచాయతీ కార్యదర్శి రవి

# పాత పెన్షన్ విధానం అమలు చేయాలి


నిరసనలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వం ఇటీవల చట్టం చేసిన జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునఃపరిశీలించాలని పలువురు ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక, ఏపీసీపీఎస్‌ఈఏ సంయుక్త నిర్వహణలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రయోజనం కల్పించని జీపీఎస్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ బిల్లు వల్ల ఉద్యోగికి ఏవిధంగానూ ప్రయోజనం ఉండదని ఆరోపించారు. ఫ్యాప్టో జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ రమేష్‌చంద్ర పట్నాయక్, సెక్రెటరీ జనరల్ డి.ఈశ్వరరావు, ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర నాయకుడు గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయులు డి.శ్యామ్, కె..జోగారావు, వివిధ సంఘాల ప్రతినిధులు డి.రాము, జేఏవీఆర్‌కే ఈశ్వరావు, బంకురు జోగినాయుడు, విజయగౌరి, సదాశివరావు, డి.శ్రీనివాసరావు, రవీంద్రనాయుడు, బంకపల్లి శివ ప్రసాద్, గంగా ప్రసాద్, జె.రామునాయుడు, రాజబత్తుల శివకుమార్, గంట త్రినాథ్, కె. ధనంజయ, కె.ఈశ్వరరావు, వి.రమణ, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉద్యోగ మేళా రేపు

విజయనగరం అర్బన్: విశాఖ, హైదరాబాద్‌లకు చెందిన వివిధ ఫార్మా కంపెనీలలో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 27న స్థానిక తోటపాలెం గాయత్రి డిగ్రీ కాలేజీలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ కె.నవీన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు 35 నుంచి 45 రోజులపాటు ఉచిత శిక్షణ ఇచ్చి, అనంతరం ఆయా కంపెనీల్లో ఉద్యోగం కల్పిస్తారని పేర్కొన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం, ఇంటర్ ఎంపీసీ/బైపీసీ విద్యార్హత కలిగి, 24 సంవత్సరాల్లోపున్న పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని ఆరోజు ఉదయం 10 గంటలకు నేరుగా ఎంపిక ప్రాంగణానికి హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాల కోసం 86881 56216, 95427 69089 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### రక్తహీనత నివారణకు చర్యలు

విజయనగరం అర్బన్: గర్భిణులు, యుక్త వయస్సు బాలికలకు రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని పలు ప్రాంతాల్లో మలేరియా, డెంగీ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించడంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

### కేజీబీవీలో క్లీన్ అండ్ గ్రీన్

నెల్లిమర్ల: స్వచ్ఛతే హే సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక కేజీబీవీలో సోమవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యాలయంతో పాటు సమీపంలోని ఈవీఎం గోదాం పరిసరాలను పరిశుభ్రంచేశారు. అలాగే విద్యార్థినులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి. ఉమా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాభాస్కర్, శానిటేషన్ సెక్రటరీ పాల్గొన్నారు.

### పరిశీలన

నెల్లిమర్ల: అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఫాల్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) లాబ్స్‌ను రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 560 పాఠశాలల్లో నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా నెల్లిమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఏఎల్ ల్యాబ్ కోసం ఒక గదిని కేటాయించి, సదుపాయాలు కల్పించారు. ఈ మేరకు ల్యాబ్ గదిని ఎంఈఓ -2 విజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాబ్ నిర్వహణపై హెచ్ఎం సీహెచ్ ఆనందమూర్తికి పలు సూచనలు చేశారు.

### ఎంపీపీకి సత్కారం


ఎంపీపీ అనూషారెడ్డిని సత్కరిస్తున్న అధికారులు

భోగాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలులో భోగాపురం మండలాన్ని అగ్రగామిగా నిలపడంతో పాటు, ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఉప్పాడ అనూషారెడ్డిని ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మండలంలో విమానాశ్రయానికి శంకుస్థాపన చేయడంతో మండలానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. అనంతరం అనూషారెడ్డి మాట్లాడుతూ, మండల అభివృద్ధికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఎంతో సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం విజయవంతానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. ఈ నెల 30 నుంచి మండలంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతీ గడపకూ వైద్యసేవలు అందించాలనే తలంపుతో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి విద్యకు, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. సమయానికి ఇంటింటి సర్వే పూర్తి చేసి, సచివాలయాల పరిధిలో ఈ నెల 30 నుంచి చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రోగులను తరలించి వైద్య సేవలు అందించాలన్నారు. దీర్ఘకాలిక, సాధారణ రోగులకు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వైద్యశిబిరాల షెడ్యూల్‌ను ఎంపీడీఓ గంటా వెంకటరావు ఎంపీపీకి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, ఈఓపీఆర్డీ తిరుపతినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతరలోగా అభివృద్ధి పనులు పూర్తి

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాముల నాయుడు


అచంటా గార్డెన్స్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పైడితల్లి జాతర సమయానికల్లా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు ఆదేశించారు. ఈ మేరకు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ట్యాంక్ బండ్ రోడ్‌లో ఉన్న ఆచంటా గార్డెన్ ప్రాంతాన్ని, ఎత్తుబ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న బస్సు షెల్టర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి తిరుమల నర్సింగ్ హోమ్ వరకు ఉన్న ఆచంటా గార్డెను అందంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో రూ.1.50 కోట్లతో పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదించింది. దీంతో దశలవారీగా చెరువు అభివృద్ధి పనులను చేపడుతున్నారు. ఇందులో భాగంగా మట్టితో చదును చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఆ ప్రాంతంలో ఫౌంటెన్లు కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ శ్రీరాములనాయుడు సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. శ్రీనివాసరావు, డీఈలు, కాంట్రాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం


గంగుల బుజ్జి రాజుకు ఆర్థిక సాయమందిస్తున్న విజయనగరం యూత్ ఫౌండేషన్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ప్రమాదంలో గాయపడిన అంబులెన్స్ డ్రైవర్‌కు విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆర్థిక సాయమందించింది. నరవ సమీపంలో నివాసం ఉంటున్న గంగుల బుజ్జి రాజు వృత్తిరీత్యా అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఒక ఎమర్జెన్సీ కేసును విశాఖ తీసుకువెళ్లే క్రమంలో రోగికి ఆక్సిజన్ ఫ్లో మీటర్ బిగిస్తుండగా.. అది పేలిపోవడంతో బుజ్జిరాజు చూపు పోయింది. దీంతో బుజ్జిరాజు జీవనం కష్టంగా మారడంతో ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తమాస్ దాతలను సంప్రదించి బాధిత వ్యక్తికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ. 5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయికుమార్, శరత్ , రఘు, విజయ్ పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల


లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ బంగారమ్మ

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ అన్నారు. మండలంలోని కొండవెలగాడ గ్రామ సచివాలయంలో 72 మంది లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ పథకం కార్డులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బంగారమ్మ మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ కార్డుతో దేశంలోని ఏ కార్పొరేట్ ఆస్పత్రిలోనైనా ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చునన్నారు. కార్డు ద్వారా ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల విలువైన వైద్యం అందుతుందని చెప్పారు. ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ వరంలా మారిందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఈఓ అప్పలనాయుడు, ఆరోగ్య కార్యదర్శి మాధవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ పి. బాలాజీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నగర పంచాయతీలో 14 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థులు ఈ నెల 29లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

- ఎంఈఓ పాపినాయుడు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ పాపినాయుడు, తదితరులు


కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

పూసపాటిరేగ: చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని ఎంఈఓలు బి. పాపినాయుడు, రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో మండల స్థాయిలో విద్యార్థులకు సోమవారం క్రీడాపోటీలు నిర్వమించారు. స్థానిక ఎస్‌వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం తప్పనిసరన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో ఆడాలని సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యాలు మెరుగు పడతాయని చెప్పారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ లీలా కృష్ణ, పూసపాటిరేగ జెడ్పీ పాఠశాల హెచ్ఎం బి. శంకరరావు, సీఆర్‌టీలు బంగారునాయుడు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.